శ్రీ రమణ జ్యోతి
అక్టోబర్ 2017
Sri Ramana Jyothi
October 2017

ఈ సంచికలో ...
IN THIS ISSUE ...

| | | | |
|---|---|---|---|
| 1. | డా॥ కే.ఎస్. గారి 43వ ప్రవచనము | డా॥ వి. రామదాస్ మూర్తి | 3 |
| 2. | ఆత్మవిచారణకు ఒక సుగమ మార్గము | నండూరి రామమోహన్ | 7 |
| 3. | శ్రీ భగవాన్ పాద సన్నిధిలో | జి. శ్రీహరిరావు | 12 |
| 4. | ఉన్మత్తప్రజ్ఞ | ధూళిపాళ చంద్రశేఖర శాస్త్రి | 15 |
| 5. | లాహిరీ మహాశయ | కాట్రావులపల్లి సుబ్బలక్ష్మి | 20 |
| 6. | భగవాన్ రమణుల దైవిక లీలలు | మల్లాది ఫణిమాల | 23 |
| 7. | **Hanuman, the Embodiment of Devotion and Humility** | Dr. K. Subrahmanian | 26 |
| 8. | **Saint Thayumanavar Swami** | K. Lalitha | 30 |
| 9. | **Ahamukham - Turning Selfward** | V. Krithivasan | 36 |
| 10. | **Framji Dorabji, an Exceptional Parsee Devotee** | | 39 |
| 11. | **Battle Called Life** | D. Samarender Reddy | 43 |

శ్రీ రమణజ్యోతి వ్యవస్థాపకులు : కీ॥శే॥ డా॥ కె. సుబ్రహ్మణియన్
(వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీరమణకేంద్రం)

**Editorial Board:** Telugu: **Dr. V. Ramadas Murthy, Malladi Phanimala, Katravulapalli Subbalakshmi**
English: **V. Krithivasan, N.S. Ramamohan, Sneha Choudhury**

# ఆధ్యాత్మికత, గర్వము, ఒకే చోట వుండజాలవు

ఆంగ్ల మూలం: డా॥ కే.యస్. గారి 43వ ప్రవచనము

తెలుగు అనువాదం: డా॥ వి. రామదాస్ మూర్తి

## ప్రతి ఒక్కరూ ప్రజ్ఞావంతులే

మనం ఏదైన పరీక్ష వ్రాయాలంటే, స్థాయిని బట్టి చదువవలసిన పుస్తకాలు వుంటాయి. కాని వాటిలో తరచు ఎంత చదువుతాం? ప్రశ్నలు వుండబోవని అందులో కొన్నింటిని చదవక వదలిపెడతాం. ఇక ఎం.ఏ. స్థాయిలో కూడ పరిస్థితి ఇంచుమించు అలాగే వుంటుంది. అప్పుడు మనకు మనం తెలుసుకొన వలసిన దానిలో చాలా కొంచెం మాత్రమే తెలుసునని అర్థమౌతుంది. పిహెచ్.డి. చేస్తున్న దశలో మనం తెలుసుకొనవలసినదానితో పోలిస్తే, మనకు తెలిసినది చాలా కొంచెం మాత్రమేనని విశదమౌతుంది. జీవితంలో తరువాత కూడా ఇదే కొనసాగుతుంది. కాని మనకు తెలిసినది తక్కువగా వున్నప్పుడు గర్వం పెరుగుతుంది. పరిజ్ఞానం ఎక్కువయ్యే కొద్దీ గర్వం అణగుతుంది. మనకు ఏదో చాలా విషయాలు తెలుసునని ఇతరులు అనుకున్నప్పుడు మన హృదయాంతరాళంలో అది యథార్థం కాదని అనిపిస్తూనే వుంటుంది. ఒక ప్రత్యేక విషయంలో మీరు విశేషజ్ఞతను సాధించివుండవచ్చుగాని అది గర్వకారణం కారాదు. ప్రతి ఒక్కరికి ఒక ప్రజ్ఞ వుంటుంది. ఒకరు బాగా ఆలోచించవచ్చు. కాని మరొకరు బాగా వండగలిగి వుండవచ్చు. ఎవరి తెలివితేటలు వాళ్ళవి.

విమానాన్ని నడిపే పైలట్ జాగ్రత్తగా నడుపుతూ మనల్ని క్షేమంగా గమ్యాన్ని చేర్చవచ్చు. అతనిది ఆ ప్రజ్ఞ. దిగిపోతున్నప్పుడు ప్రయాణీకులు అందరూ అతనిని అభినందిస్తారు. కాని ఇక్కడ ఒక విషయం గుర్తుంచుకోవాలి. విమానం సరిగా, నిరపాయకరంగా ప్రయాణించడానికి శ్రమ పడిన వారు వేరే వుంటారు. ఒకవేళ అంతకు ముందు రాత్రి విమానం

దిగి వుంటే, తిరిగి ప్రొద్దుటే ప్రయాణించడానికి తగిన స్థితిలో దానిని తయారు చేయడానికి ఎందరో రాత్రి మొత్తం పనిచేసి వుంటారు. మనం చాలా ముఖ్యమైన వాళ్ళమనుకుంటాం. అది అంతా 'మాయ' ప్రభావం. అధికారం ఊడితే, ఎవ్వరూ పట్టించుకోరు. కాని కొందరు ఆ తరువాత కూడ అదే పటాటోపం సాగించాలనుకుంటారు.

**జ్ఞానులు నిగర్వులు**

కొంతమందికి ఏ అధికారమూ వుండకపోవచ్చు. వాళ్ళు ధనవంతులు కారు. ఏదీ కోరుకోరు. ఎవరినీ ఏదీ అడగరు. అయితే వారికి అహం వుండదు. కాని ఇతరుల దగ్గర లేనిదేదో వారి దగ్గర లభిస్తుంది. అదే శాంతి. ఇతరులతో ప్రవర్తించే తీరులో వాళ్ళ కంటే తామే మెరుగైన వారమన్న భావన కలిగించరు. వారు ఎంతో నమ్రత ప్రదర్శిస్తారు. అలాంటి అసాధారణమైన వారి సన్నిధిలో ఇతరులు తాము కోరే ప్రశాంతతను అనుభవిస్తారు. ఆనందం పొందుతారు. గర్విష్టిని జనం ఇష్టపడరు. ఎందుకంటే, తమ అహాన్ని అతడు అవమాన పరిచినట్లు భావిస్తారు. తనకు ఏదో ఒక విషయం తెలుసునని ఎవరైన అంటే అవతలివారికి కోపం వస్తుంది. కారణం తమకు కూడ కొంత తెలుసు కదా! ఒకరు తనకు ఏమీ తెలియదు అని అంటే గొడవ వుండదు. పోటీ వుండదు. భగవాన్‌తో ఎవరైన ఇది ఇలా వుండాలి, అలా వుండాలి, అని వాదించబోతే, "ఏమో, నాకేమి తెలుసు. నేనేమీ చదువుకోలేదు, నీవే దిద్దు" అనేవారు. పరిపూర్ణమైన నమ్రత వున్నప్పుడే అది సాధ్యమౌతుంది. అహంతో గర్వం పుట్టుకొస్తుంది. అది అణిగి నప్పుడు నమ్రత ప్రదర్శింపబడుతుంది.

బ్రదర్ లారెన్స్ అన్న ఒక గొప్ప మార్మికుడు, "నేను చేయదలచు కొన్నది చేస్తాను. చేసే ప్రతి పనిలో పూర్తి సామర్థ్యాన్ని చూపుతాను. ఇతరుల కోసం ఏదీ చేయను. ఆ ప్రభువు కోసం చేస్తాను" అనే వాడు.

ఆయన వంట చేసినప్పుడు అతి జాగ్రత్త తీసుకునేవాడు. ఎందుకంటే, ప్రజల ద్వారా తాను భగవంతునికి ఆహారం ఇస్తున్నట్లు భావించేవాడు. మనం కూడ అలాంటి ధోరణిని అలవరచుకుంటే "ఈశ్వరార్పితం, నేచ్ఛయాకృతం" అని శరణాగత భావం కనబరిస్తే, కార్యం ఉత్తమంగా చేయగలుగుతాం. ఇతరుల మెప్పును ఆశించవలసిన పనిలేదు. భగవంతుని కోసం చేస్తాం. కొందరు మెచ్చుకోవచ్చు, కొందరు మెచ్చుకొనకపోవచ్చు. మెప్పుదలను ఆశించడం అహం యొక్క కోరిక.

**అందరు గురువులను గౌరవించాలి**

ఆధ్యాత్మికత విషయాలలో కూడ, నా గురువే ప్రపంచంలోని అందరు గురువులకంటే గొప్ప, ఇతర గురువులు ఎందుకూ పనికిరారు అని చెబుతుంటాం. అది స్వీయ అనుభవంతో అన్న మాట కాదు. అన్నిటిలో లాగే ఈ విషయంలో కూడ తానే గొప్ప అని చాటుకోవడం. అసలైన ఆధ్యాత్మికపరులు ఇతర గురువుల గురించి అలా అనరు. ప్రతి ఒక్కరిలో ఒక ప్రత్యేకత వుంటుంది గనుక గురువులందరికీ మర్యాద ఇవ్వాలి. అలా ఒప్పుకొనేందుకు కూడ భగవంతుని కృప అవసరం. ఇతర గురువుల దగ్గరికి పోదలచుకోకపోతే, అది వేరే విషయం. కాని అలా వెళ్ళవలసివచ్చిన సందర్భాలలో, ఇతరులు నమస్కరిస్తున్నప్పుడు, నా గురువుకు తప్ప ఇతరులకు నమస్కరించను అని అనరాదు. అది అహం లక్షణం. అంతగా అయితే, తన గురువును తలచుకొని అందరితోబాటు నమస్కరించాలి. ప్రతీది ఈ ప్రపంచంలో దైవస్వరూపమన్నప్పుడు ఇంకొక గురువు పట్ల అమర్యాద చూపడం, ఆధ్యాత్మిక పురోగతికి ఒక అడ్డంకి.

ఆదిశంకరులు మూర్తీభవించిన నమ్రత. "ప్రభూ! నాకు వినయాన్ని ఇవ్వు" అన్నారు. శంకరుల జీవితం ద్వారా మనం సరియైన పాఠాన్ని నేర్చుకునే విధంగా భగవంతుడు ఏర్పాటు చేశాడని అనుకోవచ్చు. ఒక

సంఘటన కారణంగా మనకు సన్మార్గాన్ని చూపాలని భగవంతుడు ఏర్పరచాడు. ఇది శంకరులకు తెలియక కాదు. కాశీలో ఒక రోజు శంకరులు వెళ్తున్న దారిలో ఒక హరిజనుడు తారసపడ్డాడు. అప్పటి అగ్రవర్ణ హిందువులు ప్రవర్తించేలా శంకరులు ఆ హరిజనుని పక్కకు తప్పుకోమన్నారు. అప్పుడు అతడు తిరిగి ప్రశ్నిస్తూ "నాకు అర్థం కావడం లేదు. మీరు ప్రక్కకు తప్పుకోమనడం నా శరీరానినా, లేదా నా ఆత్మనా? శరీరాన్ని ఉద్దేశించి వుంటే ప్రక్కకు తప్పుకుంటాను. నా ఆత్మను ఉద్దేశించి అనివుంటే, అది వీలు కాదు. ఆత్మ అంతటా వుంది" అన్నాడు. నివ్వెరబోయిన శంకరులు ఆ వ్యక్తి సామాన్యుడు కాదని గుర్తించారు. అప్పుడు ఆ హరిజనునికి బదులు శివుడు ప్రత్యక్ష మయ్యాడు. (సశేషం)

అరుణాచలశివ

**అహము కలదనిన నఖిలము గలదు;**

**అహము లేదన్న లేదఖిలము; గాన**

**అఖిల మహ; మదియేదని వెదకుటయె**

**అఖిలమును వదలుటగునని యెఱుఁగు ॥**

*(ఉన్నది నలుబది - సద్విద్య*

# ఆత్మ విచారణకు ఒక సుగమ మార్గం

ఆంగ్ల మూలం: నండూరి రామమోహన్

(గత సంచిక తరువాయి) తెలుగు అనువాదం: విడపనకంటి

"నీవున్నావని నీకు తెలుసు. ఏ క్షణంలో గాని నీ ఉనికి లేదన్నది నీవు అనలేవు. ఎందుకంటే అలాగ లేవు అనడానికి కూడ 'నీవు' కావాలి. మనసును నిశ్చలంగా వుంచుకొనడం ద్వారా నీ యొక్క యథార్థ ఉనికిని అవగాహన చేసుకొనగలవు. మనసే వ్యక్తి యొక్క బాహ్యానికి ప్రసరించే గుణం కలది. దానిని లోనికి మళ్ళిస్తే, కొంత కాలానికి అది నిశ్చలమై "నేను ఉన్నాను" అన్న భావన మాత్రమే మిగులుతుంది. (భాషణలు 503). బుద్ధిని అహంలోనికి లీనం చేసి అహం యొక్క మూలాన్ని (నేను-ఆలోచన) వెదుకు" (భాషణలు 618).

మనసు అలాగ స్థిరపడినప్పుడు, మనం మూలాన్ని గురించి శ్రద్ధ చూపడానికి సిద్ధంగా వుంటాం. భాషణలు (503)లో భగవాన్ తెలిపి నట్లు "మనం ఉన్నామని మనం ఎఱుగుదుము : ఏదేని ఆలోచన వల్ల మన ధ్యాస చెదరగొట్టబడకుండ వుండడం కోసమే "ఈ ఆలోచన ఎవరి కోసం?" అన్న ప్రశ్న వేసుకున్నాం. ఆత్మ గురించిన ధ్యాస సాగు తున్నప్పుడు ఏదైన ఆలోచన ఉదయించినప్పటికి, అది మాయమవు తుంది; "నా కోసం" అన్న జవాబు యొక్క అవసరం వుండదు. సాధన సాగుతున్న దశలో "నా కోసం" అన్న జవాబు అవసరమైనదని అనిపిస్తే అలా చేసుకుని, "నేను ఎవరు?" అన్న ప్రశ్న వెంటనే వేసుకోవాలి, ధ్యాస చెదరగొట్టబడినట్లు అనిపించినపుడు ప్రశ్న వేసుకోవాలి. కాని మనసు నిశ్చలంగా వున్న స్థితిలో మూలం పై స్థిరంగా వున్న స్థితి మాత్రం చెదరదు.

ఇదే విషయం (మనసుని నిశ్చలం చేసుకుని అహం వృత్తి యొక్క మూలాన్ని వెదకడం). భాషణలు (503, 618)లో స్థూలంగా చెప్పబడి

వుంది. ఒకే మాట (పదం) పఠిస్తూ పోవడం వల్ల కూడ అదే లక్ష్యాన్ని చేరవచ్చు. మనం ఏదైన ప్రార్థనను చదువుతూ, మూలంపై ధ్యాస వుంచితే, బుద్ధిలోదిరిగి, మూలాన్ని పరిశీలిస్తోందన్న మాట. సాధారణ అనుభవంలో మనం ఒక వైపు ప్రార్థన జరుపుతూ వుంటే, మన మనసు మరి దేని చుట్టూనో తిరుగుతూ వుండవచ్చు. కాని ఇంతకు ముందు మనం అనుకున్నట్లు మూలం గురించి తీక్షణంగా గమనిస్తూ ప్రార్థన జరుపుతుంటే మనసు స్థిరపడుతుంది. మూలంపై ధ్యాస వున్నప్పుడు మన ఉనికి మనకు విదితమవుతుంది. బుద్ధి అహంలోనికి, అహం మూలం లోనికి లీనమవుతాయి. ఆలోచన ఉదయించిన సమయంలో అహం ('బుద్ధి' పాత్ర వహిస్తున్న అహం) ఒక ఆలోచనను పట్టుకుంటే అకస్మాత్తుగా మన ధ్యాస మూలం వైపు గాకుండ, మన ఉనికి (బుద్ధి యొక్క భౌతిక స్థానమైన) మెదడు వైపు మరలినట్లు మనం గ్రహిస్తాం. అహం అలాంటప్పుడు వున్న ఆలోచనను వదలిపెట్టి మరొక ఆలోచనను గ్రహించడం, అలా ప్రక్కదోవ పడుతుంది; మన ఉనికిని గురించిన ఎఱుక వున్నట్లుండి మరుగవుతుంది. అలాగ జరగకుండ, మన ధ్యాస ఒక ఆలోచన వైపు మరలిన సంగతిని గుర్తించి వెంటనే మూలం వైపు ధ్యాస త్రిప్పితే, మన ఉనికిని గురించిన ఎఱుక మళ్ళీ కలుగుతుంది. బాహ్యాపరమైన ఎఱుక రంగంలోనికి వస్తే ఆత్మ-ఎఱుక నశిస్తుంది. ఈ పరిస్థితి తిరగబడినపుడు కూడ ఇదే వర్తిస్తుంది. ఈ క్రమంలోనే మనం ఎఱుకను దిశ మార్చుకుంటూ, మళ్ళీ వెనక్కి వచ్చే పరిస్థితి ఏర్పడుతుంది.

ఆత్మపై ధ్యాస మరికొన్ని కారణాల వల్ల కూడ పక్కదారి పట్టవచ్చు. ఒక వస్తువు లేక దృశ్యం వైపు ఆకర్షింపబడినప్పుడు లేదా ఎవరైన మాట్లాడడం ఇతర శబ్దాలు చేసినప్పుడు ఆ పరిస్థితి ఏర్పడుతుంది. ఇలాంటి పరధ్యానాలన్ని కూడ ఆలోచనల వివిధ రూపాలు. అందుకే ''చూసేవారెవరు?'' ''వినేవారెవరు?'' మొదలైన ప్రశ్నలను

ఉపయోగించాలి. "చూసే వారెవరు?" అన్న ప్రశ్న చూసేవారికి, చూడ బడేవాటిని వేరు వేరుగా చూచే దృష్టిని తీసేస్తుంది. అది నిజంగా ఎలా వుంటుందని తెలియాలంటే, ఆ పరిస్థితిని యథార్థంగా అనుభవించాల్సిందే.

ఒకసారి మనసు నిశ్చలమైతే, పఠనం (జపం), అన్వేషణ మార్గాలు అన్వేషణ ప్రయత్నంలో ఉమ్మడిగా తిరుగుతాయి. ఇక అన్వేషణలో నిలకడగా వుండడము ఎలాగన్నది తరువాతి ప్రశ్న.

వాసనల కారణంగా ఏర్పడే ఆలోచనలు ఉదయిస్తున్నప్పుడు మన వైరాగ్యాన్ని బట్టి మన ధ్యాస మూలంపై కేంద్రీకృతమవుతుంది, లేదా ఆలోచనలవైపు మరలుతుంది. వైరాగ్యమన్నది మన సౌఖ్యం యథార్థంగా మూలకేంద్రమైన ఆత్మను ఆశ్రయించి వుంటుందనీ మరెక్కడను వుండదనుకొనే ఒక మేధోపరమైన నమ్మకం. అలాంటి నిశ్చితమైన అభిప్రాయం నిత్యానిత్య వివేకంతో ముడిపడి వుంటుంది. అంటే మామూలు భాషలో చెప్పాలంటే మనం జరిపే ఏ క్రియ వల్ల గాని లభించేది తాత్కాలికము, నశించిపోయే సుఖమా లేదా శాశ్వతం, నిరంతరం అయిన ఆనందమా అని వైరాగ్యం వివేచనతో విశ్లేషణ జరుపుతుంది. శాశ్వతమైన మూలం శాశ్వతమైన ఆనందాన్ని ఇస్తుంది.

ప్రతి ఒక్కరు సౌఖ్యాన్ని కోరుకుంటారు, కాని బాధతో పెనవేసుకున్న సుఖాన్ని నిజమైన సుఖంగా పొరబడుతారు. అలాంటి పొరబాటు చర్యల వల్ల తాత్కాలిక సంతోషం మాత్రమే కలుగుతుంది. ప్రపంచంలో బాధలు, సుఖాలు ఒకదాని వెంబడి ఒకటి వస్తుంటాయి. బాధను కలిగించేవి, సుఖాన్ని కలిగించే విషయాలు ఏమిటో వివేకంతో గ్రహించి, సుఖాన్ని ఇచ్చే కర్మలకు మాత్రమే పరిమితమై వుండడమే వైరాగ్యం. ఏ పని ఫలితంగా తరువాత బాధ ఏర్పడదో వివేకవంతుడు అలాంటి వాటిని వెదకి వాటినే ఆచరిస్తాడు. అలా కాకుంటే మనిషి ఒక పాదం ప్రపంచంలో, మరొకటి ఆధ్యాత్మిక ఆచరణలోను వుంచినవాడవుతాడు.

(రెండు విషయాలలోను సంతృప్తికరమైన ప్రగతిని సాధించలేదు). (టాక్స్ 302).

ఆధ్యాత్మిక గ్రంథాలు ''అంతర దృష్టి'', ''ఏకీకృతమైన దృష్టి'' అన్న వాటిని ప్రయోగిస్తుంటాయి. ఆత్మ ఎల్లప్పటికి ఆత్మయే అయి వున్నప్పుడు ''ధీరుడు'' మాత్రమే జ్ఞాని ఎందుకు అవుతాడు? ధీరుడు అంటే ధైర్యం గల వాడని అర్థమా? కాదు ధీః=బుద్ధి, రః=గమనించడం, రక్షణ. అంటే ఎల్లప్పుడూ మనసును అంతర్ముఖం చేసి ఆ పట్టు సడలించని వాడు. (టాక్స్ 352).

శ్రీ రమణాశ్రమము వారి ప్రచురణ ''మహర్షి అండ్ హిజ్ మెసేజ్''లో శ్రీ పాల్‌బ్రంటన్ వ్రాసిన మాటలు చాలా ఉపయోగకరంగా వుంటాయి. ''ఇంతకు పూర్వం నా ధ్యాన సమయాలలో తలెత్తుతూ వుండిన మానసిక అనుమానాలు ఇటీవల తెరమరుగయ్యాయి. వాటికి బదులు, భౌతిక, భావోద్రేక, మానసిక సంచలనాలను ప్రశ్నిస్తూ పోయాను. కాని ఆత్మ అన్వేషణాప్రయత్నంలో అసంతృప్తి చెంది వాటన్నింటిని వదలిపెట్టాను. చైతన్యం యొక్క ధ్యాస దాని కేంద్రం మీదనే వుంచుతూ దాని ఆవిర్భావ మూలాన్ని గురించిన ఎఱుక కోసం ప్రయత్నిస్తున్నాను'' అని ఆయన అన్నారు. ఆయన 'సంచలనాలు' అన్న పదాన్ని ఉపయోగించడంలో, మూలమైన ఆత్మ పై దృష్టి నిలప డానికి ఆయన ఒక వివేచనాత్మక ప్రక్రియను ఉపయోగించి వుండ వచ్చు. ఆత్మ అన్వేషణలో కృతకృత్యులైనవారు లేదా అందులో లోతుగా నిమగ్నమైన వారు ఏదో ఒక సమయంలో అలాంటి వివేచనను ఉపయోగించి వుంటారు.

అన్వేషణాప్రక్రియలో ఆలోచనలు/వాసనలు మన ధ్యాసలోనికి వచ్చినప్పుడు మూలం పై ధ్యాస విడనాడకుండ వుండగలిగితే అప్పటి దాకా దాక్కుని వున్నవి కాస్త బయటపడి నశిస్తాయి. వెలుతురు ప్రభా వానికి గురి అయినప్పుడు చీకటి వెలుగవుతుంది. వాసనలు పూర్తిగా

నశించిపోవడానికి, మనం మూలంలో స్థిరంగా నిలవడానికి, బహుశః ఇది ఒక్కటే మార్గం.

అన్వేషణ జరుగుతున్న సమయంలో అహం దొంగచాటుగా ప్రవేశించకుండ మనం జాగ్రత్త పడాలి. మనలో మనం మాట్లాడు కొనడం, మరేదో విషయాన్ని అది భగవాన్ బోధనలకు సంబంధించిన దైనా సరే, దాంట్లో నిమగ్నం కాకుండ చూసుకోవాలి. అలాంటి భగ్నపరిచే సంఘటన జరిగితే మనం మరింత జాగరూకతతో వ్యవహరించాలి. దేని గురించి అయినా సరే వ్యాఖ్యానం చేయాలన్న కోరిక కలిగినప్పుడు కొన్ని క్షణాలు శ్వాసను నియంత్రిస్తే ఆ కోరిక నశిస్తుంది. మానసిక అహంకారపూరిత చర్య ఎలాంటిదైనప్పటికి, అన్వేషణకు భంగం కలిగిస్తుంది. అలాగే పఠనం జరుగుతున్నప్పుడు మనసు పక్కదారులు పడుతుంటే కూడ అందువల్ల ఏ ప్రయోజనమూ వుండదు.

ఏ ప్రక్రియ ద్వారానైన సరే ఆత్మాన్వేషణ చేస్తున్నప్పుడు మూలంపై ఏకాగ్రదృష్టి పెట్టి వుండడమన్నది విజయానికి ముఖ్యమైన అంశం. మన ఇళ్ళకు దూరంగా వుండే చెరువు నుండి నీటిని కుండల్లో ఎలా తీసుకొస్తారో భగవాన్ చెబుతారు. అలా నీళ్ళు తెస్తున్నప్పుడు వాళ్ళు హాస్యంగా మాట్లాడుతూ తమాషాలు చేసుకుంటూ నడుస్తుంటారు గాని వాళ్ళ ధ్యాస మాత్రం తలమీద వున్న కుండ మీదే వుంటుంది. మూలంపై ధ్యాస వుంచితే వాసనల నాశనానికి సహాయ పడుతుంది. కాని పరధ్యానం లేకుండ ఏకాగ్రత చూపించినపుడు పురోగతి మరింత తొందరగా జరుగుతుంది. ఏదో ఒక ఆలోచనకు మొగ్గు చూపి దానినే పట్టుకునే స్వభావం నుండి బుద్ధిని దూరం చేయాలి. అలాంటి బుద్ధి మూలంపై ధ్యాసను వుంచి ఆత్మను అనుభవించడంలో దోహదపడుతుంది. మూలం వైపు తిరిగి నిమగ్న మైన అలాంటి బుద్ధి అసలైన 'నేను'ను ప్రతిఫలిస్తుంది.

*(సమాప్తం)*

# శ్రీ భగవాన్ పాద సన్నిధిలో (At the feet of Bhagavan)

ఆంగ్లమూలం: టి.కె. సుందరేశ అయ్యర్
(గత సంచిక తరువాయి) తెలుగు అనువాదం: జి. శ్రీహరిరావు

## అరుణాచల స్తుతి పంచకమునకు నాంది

ప్రశాంత చిత్తముతో నిశ్చలముగా వుండి 'అహం బ్రహ్మాస్మి' అని స్వస్వరూపమును గ్రహించుటయే శ్రీ భగవాన్ సాధించిన మహా కార్యము. హృదయకుహర మధ్యము నుండి 'నేను', 'నేను' అనుచూ ప్రకాశించు దివ్యత్వమే తాను. సద్వస్తువూ, కేంద్ర బిందువూ అదే. జ్ఞాన సర్వస్వమూ, అమృతానందహేతువూ అదే. ఈ కేంద్రమే సమస్త సృష్టికీ, సమస్తము లయ చెందుటకూ కారణభూతము. అంతయు శాంతియే. విభేదములకు తావు లేదు. అహంకారము తలెత్తదు. అభిప్రాయ భేదములు ఏర్పడుటకు 'నీ', 'నా' తేడాలుండవు. సర్వ వ్యాపకము, సర్వాంతర్యామి అయిన ఆత్మ స్వరూపమే శ్రీరమణ భగవాన్.

పరిపూర్ణమైన ఆ దివ్యానందమే అత్యుత్కృష్టమయిన మానవ స్వరూపము. మరుగుపరచలేని పరమ సత్యము. నలు దిశలూ ప్రాకుతూ, సాధకులను తన వైపు ఆకర్షించుకొనును. ఆ నిశ్శబ్దం అనంతము. అద్భుతమైన ప్రకటనాశక్తి కలది. దాని ఉనికిని యితరులు ఊహించగలరు, అనుభవించగలరు గానీ, దాని పూర్తి ప్రమాణము, దాని మూలమునూ గ్రహించలేరు. తెలుసుకొన ప్రయత్నము చేయుదురు కానీ, ఆ నిశ్చలత్వము నిర్భేద్యము. తెలుసుకొనవలెనను కోర్కె పెరుగుచూవుండి, ఒక తపనగా మారును.

ఈ వజ్రకఠోరమైన నిశ్చలత్వము కరుణాక్షీరముగా మారి (సాధకునికి) పరిపక్వత కలుగగనే అనుగ్రహించును. మొదట కొద్ది కదలిక కనిపించును. కంఠస్వరము వినిపించ సాగును - ఒకటి, రెండు శబ్దములు ఉచ్చరించబడును. ప్రజ్వలమయిన కాంతి చొచ్చుకు పోయినట్లుగాను, అగ్నిసమానమయిన భావము నిండియున్ననూ, ఆ స్వరము పసివాని పలుకులు వలె శ్రోతలకు సుస్పష్టముగాదు. క్రమముగా, శృతి సరిచేసుకున్న స్వరము వలె ఆ శబ్దము నెమ్మదైన ప్రవాహము వలె జాలువార మొదలిడును. అచిరకాలములో ఆ నాద మాధుర్యము గంగా సమానమయిన గాంభీర్యముతో వరదవలె ప్రవహించి, ఎండి బీటవారిన హృదయాలను సారవంతము చేసి, ఆ గాన ఝరితో జ్ఞాన సాగరగర్భ జలముల లోతును తెలియపరుచుటలో తనను తానే మించిపోవును. శ్రీ భగవాన్ రచనల ఆరంభమిట్టిదే. అవి పుస్తక రూపములో ప్రచురణ కాక ముందు వాటి నాంది బహు సూక్ష్మముగా మొదలై క్రమేణా వారి పలుకులు ప్రస్తుత రూపమును సంతరించుకున్నవి.

‘‘అక్షరమణమాల’’ అరుణాచల స్తుతి పంచకములో మొదటిదీ, ప్రముఖమైనదీ కూడ. శ్రీ భగవాన్ భక్తులు, బిక్షాటనకు బయలు దేరినప్పుడు, తమదేననిపించు ఒక ప్రత్యేకమయిన ప్రార్థనా గీతమును ప్రసాదించమని శ్రీవారిని వేడుకొనగా వారు అనుగ్రహించిన స్తోత్రము అక్షరమణమాల.

మామూలుగా శ్రీ భగవాన్ భక్తులు కీర్తనలు చేసుకొనుచూ బిక్షకు బయలుదేరినప్పుడు, గృహస్థులు, తామిచ్చు భిక్ష శ్రీ భగవాన్ కూడా గ్రహించెదరను పూజ్యభావముతో తమతమ శక్త్యానుసారము భక్ష్యము

లిచ్చెడువారు. ఇతర భిక్షకులతో పోల్చినప్పుడు శ్రీ భగవాన్ భక్తులకు బహు ఉదారముగా మరింత ఎక్కువగా తిను పదార్థములను నివేదించెడి వారు. ఇది గమనించిన కొంతమంది బిచ్చగాళ్ళు, అవే పాటలు తాము కూడా రమణ భక్తుల వలె పాడుకుంటూ భిక్షాటనకు బయలుదేరి, గృహస్థులకు యిబ్బంది కలుగజేయ మొదలిడిరి. ఈ సందిగ్ధము నుండి బయట పడుటకు ఒక ప్రత్యేకమయిన స్తోత్రము అవసరమాయెను.

భక్తులు తమ ప్రార్థనను వినిపించినప్పుడు శ్రీ భగవాన్ యెప్పటి వలెనే మౌనము వహించిరి. భక్తుల కోరిక చాలా కాలము వరకూ తీరలేదు. అనుకోకుండా, భక్తులతో ఒకసారి గిరి ప్రదక్షిణ చేస్తున్నప్పుడు శ్రీ భగవాన్ కంఠము నుండి 108 శ్లోకములతో శ్రీ అరుణాచలేశ్వరుని స్తుతించుచూ, ప్రార్థించుచూ ఆశువుగా వెలువడిన రచన శ్రీ అక్షరమణ మాల. ఈ మాలలోని పాటలన్నియు ఒక ప్రియురాలు తన ప్రియుని కొరకు పడు భరించలేని విరహవేదనను ప్రతిబింబించు పాటలుగా గోచరమగును. శ్రీ మాణిక్యవాచకర్, ఆ సాంబశివుని ప్రార్థించిన కీర్తనలను పోలిన రచనయే అక్షరమణమాల. ఈ నాటికీ భక్తులు శ్రీ భగవాన్ రచనలయందలి యీ మాణిక్యమును క్రమము తప్పక ఆశ్రమము హాలులో తన్మయముతో పాడుకొనుట చూడగలము.

(సశేషం)

# ఉన్మత్త ప్రజ్ఞ

- ధూళిపాళ చంద్రశేఖర శాస్త్రి

ఆధ్యాత్మిక సాధనలో అస్వస్థత సాధకునికి ముఖ్యావరోధము. అది శారీరకము లేక మానసికము లేక రెండునూ కావచ్చును. ఈ సమస్య సాధకుని సమతుల్యతను భంగపరుస్తూ, దృష్టిని మరలుస్తూ ప్రగతి రోధకమవుతోంది. కాని, శరీరము వ్యాధిగ్రస్తమైనప్పటికి, దానికి అతీతముగా సాధనామగ్నులైన వారి చరిత్రలు అనేకము మనకు కనుపిస్తాయి. సత్యాన్వేషణలోను, తదనురూప సాధనలోను వారి మానసిక సంలగ్నత వారికి ఆ స్థైర్యాన్నిస్తోంది. వారు తమ మానసిక సంకల్ప శక్తితో దేహము యొక్క అనారోగ్య సమస్యను ప్రక్కన పెట్టి పురోగమించగలిగారు. కాని, మానసిక స్వస్థతయే లోపిస్తే, ఆ సాధకునికి దారేది?

అందువలననే, రాబర్ట్ పావెల్ గారు వార్థక్యములో మానసిక దౌర్బల్య స్థితి రాకముందే జాగ్రత్త పడవలసిన అవసరాన్ని సూచించారు. అది వాస్తవమే అయినా, అట్టి దుఃస్థితి ఎవరికైనా, ఎప్పుడైనా రావచ్చు. దానికి వయస్సొక్కటే కారణం కాదు. అందువలన ఇది సాధకులందరి సమస్య. ఇక, మానసిక అస్వస్థత అనే దానికి, సరియైన నిర్వచనం లేదు.

“ఒకే పనిని పదే పదే చేస్తూ, ప్రతిసారీ వేరు వేరు ఫలితాలను ఆశించటమే ఉన్మాదము” అనేది ఒక నిర్వచనము. “అస్తవ్యస్తమైన ఆలోచనలు, దీర్ఘకాలిక దుఃఖము, చిరచిరలు, మాటిమాటికీ మారిపోయే భావోద్వేగాలు, అమిత భయము, చింత, ఆదుర్దాల సముదాయమే ఉన్మత్త స్థితి”, అనేది ఇంకొక నిర్వచనము. ఇట్లా అనేక

నిర్వచనాలున్నా, సాధన దృష్ట్యా ''మానసిక సమతుల్యతా రాహిత్యమే ఉన్మత్తత'' అని మనము చెప్పుకోవచ్చును. ఇప్పుడు మన సమస్య, ఈ అవాంఛనీయ స్థితిని దాటి వెళ్ళలేకపోతే, జీవితంలో పరమ లక్ష్యమును చేరుకొనే అవకాశము చేజారిపోయినట్లేనాయని.

వైద్యశాస్త్రము కేంద్రీయ నాడీమండలమునందలి పెద్ద మెదడు, చిన్నమెదడు, వెనుబాము, మస్తిష్కములోని రసాయనిక పదార్థములు- వీనియందలి మార్పులు మానసిక సమస్యలకు కారణములుగా భావించి తగిన ఔషధ సేవనమును పరిష్కారముగా సూచిస్తోంది. 'శరీరములో మనస్సు ఉన్నది' అనే సూత్రముపై ఈ పరిష్కారము ఆధారపడి యున్నది. అందుచేత దీనికి కొన్ని పరిమితులున్నాయి.

ఈ సందర్భములో జిడ్డు కృష్ణమూర్తి గారు, డాక్టర్ డేవిడ్ బొహెమ్ గారి మధ్య జరిగిన సంభాషణను ఒకసారి చూద్దాము -

కృష్ణమూర్తి: ఎక్కడ సంపూర్ణమైన అవగాహన ఉంటుందో, అక్కడ సందిగ్ధత లేదు.

డాక్టర్: అలవాటులో ఇరుక్కొని పోవటం ఉండదా?

కృష్ణమూర్తి: ఆ స్థితిలో సందిగ్ధత ఏ మాత్రం ఉండదు. ఎందుకంటే అది అంతే.

డాక్టర్: భౌతికంగా మెదడుకి ఏమైనా జరిగితే, అప్పటి సంగతేమిటి?

కృష్ణమూర్తి: అప్పుడు దానిని కోల్పోయినట్లే.

డాక్టర్: అందువలన, మెదడు ఆరోగ్యంగా ఉండాలి అనే నిబంధనకు లోబడియే మీరు చెప్తున్న విషయమున్నట్లు కదా.

కృష్ణమూర్తి: అంతే కదా. పూర్తి జీవ వ్యవస్థ ఆరోగ్యముగా ఉంటేనే.

ఏదైనా ఒక ప్రమాదము జరిగితే, నీ మెదడుకి తీవ్ర ఆఘాతము తగిలితే, ఏదైనా గాయమయితే, అది నాశనమైపోయినట్లే.

- సంపూర్ణ స్వేచ్ఛ, పేజీ 240

దీనినిబట్టి సంపూర్ణ అవగాహన, శారీరక, మానసిక వ్యవస్థ ఆరోగ్యముగా ఉండటముతో ముడిపడి ఉంటోంది. ఆ వ్యవస్థ అవ్యవస్థకు లోనైతే ఉన్నది కూడ పోతోంది అనియే.

కాని, నశ్వరమైన మనశ్శరీరాలనెడి ఉపాధి మంచి చెడుల మీద ఆధారపడిన ఆ స్థితి సాధకుని లక్ష్యమైన శాశ్వతానంద స్థితి కాగల అవకాశము ఎక్కడ ఉన్నది? ప్రారబ్ధవశాన సంప్రాప్తమయ్యే శారీరక, మానసిక ఆరోగ్య, అనారోగ్య పరిస్థితులను నియంత్రించగల శక్తి సాధకునకు లేదు. వచ్చిన దానిని స్వీకరించటం కన్నా వేరే మార్గమూ లేదు. శరీరము పాడైతే మనస్సుతో నిలద్రొక్కుకొనవచ్చును. కాని, మనస్సే పాడైతే? అట్టి ఉన్మత్తావస్థలో ఉన్నవాడికి శరీర, మానసిక వ్యవస్థకు అతీతమైన ప్రజ్ఞను పట్టుకోవడము సాధ్యమా. అట్టి ప్రయత్నం సాధ్యమేయని నమ్మకం కలిగించే విషయమేదైనా ఉంటే శరీర, మానసిక స్థితులను పట్టించుకోకుండా సాధకుడు సాధనామగ్నుడు కావచ్చును. అందుచేత, ఆ విషయాన్ని చూద్దాము.

భగవాన్ శ్రీరమణ మహర్షుల భక్తకోటిలో అత్యున్నత స్థాయికి చెందిన వారిలో ఎస్.ఎస్. కోహెన్ ఒకరు. శ్రీరమణాశ్రమ వాసులైన వారి చరమ జీవిత కాలములో, ఒకసారి వారు క్రింద పడిపోవటం వలన తాను కుంటి వాడినై పోయానని భావించారు. డాక్టర్లు ఆయన కాలు అన్ని విధాల బాగానే ఉన్నదని చెప్పినా కూడా చక్రాల కుర్చీకే పరిమితమై పోయారు. చిన్నస్వామి కుమారులైన గణేశన్, కోహెన్ గారిని

చూడటానికి వెళ్ళినప్పుడు ఆ సన్నివేశము, వారి మధ్య జరిగిన సంభాషణ ఇలా నడిచింది -

కోహెన్: చూడు గణేశన్! నేను కుంటివాడినై పోయాను. అయినా ఆశ్రమ నిర్వాహకులు నన్ను 7వ అంతస్తులో ఉన్న గదిలోకి మార్చారు. ఇక్కడ నీళ్ళు లేవు. నేనేం చేయాలి. ఈ గది కేవలం నా ఒక్కడికే అని వాళ్ళు అంటున్నారు. కాని రాత్రిళ్ళు ఇక్కడ 12గురు నిద్రపోతారు. కన్నన్ (సేవకుడు) ఒక్కడే అనుకోకు. ఇక్కడ ఒకే రకంగా కనిపించే 9 మంది కన్నన్‌లు ఉన్నారు.

కోహెన్‌గారి మతిమాలిన మాటలు విన్న గణేశన్ కంటనీరు పెట్టుకొని ఇట్లా అన్నారు.

"మిస్టర్ కోహెన్! నాకు పరిచయమున్న వారిలో మీరు అత్యుత్తమ బుద్ధిశాలులైన సాధకులు. కానీ, ఎందుకు మీరిలా అసంబద్ధంగా మాట్లాడుతున్నారు?"

అప్పుడు కోహెన్ తనను తాను సర్దుకొన్నారు. నేరుగా గణేశన్ మొహంలోకి చూస్తూ, ఇట్లా అన్నారు:

"శరీరానికి వార్ధక్యము వచ్చినప్పుడు, దాని మీద నీకు నియంత్రణ పోతుంది. అలాగే మనస్సు మీద కూడ. అందుచేత, శరీరము, మనస్సు ఎట్లా ప్రవర్తిస్తున్నాయి అనే దానికి ఎలాంటి ప్రాధాన్యత ఇవ్వవద్దు. అవి 'నేను' కాదు."

కొన్ని నిమిషాల క్రిందట అర్థరహితంగా మాట్లాడిన కోహెన్ గారి ఈ మాటలు విని గణేశన్ అత్యంత ఆశ్చర్యానికి లోనై, ఇట్లా అన్నారు. "మీరు మనస్సు కాకపోతే, శరీరము కాకపోతే నాతో ఇప్పుడు ఎవరు మాట్లాడుతున్నారు?" కోహెన్ గారు అన్నారు. "నేను మనశ్శరీరాల

ద్వారా జరిగే దానిని చూస్తున్న శుద్ధ చైతన్యాన్ని. వాటితో నాకు ఎలాంటి సంబంధమూ లేదు. నేను కేవలము ఆనందమే. ఈ మాటలు మాట్లాడుతున్నప్పుడు కోహెన్ గారి ముఖంలో ప్రశాంతత, తేజస్సులను గణేశన్ గమనించారు. తరువాత మళ్ళీ కోహెన్ మతిలేని మాటలు మాట్లాడటం మొదలు పెట్టారు.

ఇది ఆధ్యాత్మిక చరిత్రలో అతి అరుదైన సంఘటన. ఇక్కడ కొన్ని గమనార్హమైన విషయాలున్నాయి.

మానసిక రుగ్మత కోహెన్ గారి ప్రజ్ఞాపూర్ణ స్థితిని భంగపరచలేదు. అట్లా అని రుగ్మత మాయమై కూడ పోలేదు. తిరిగి వారు మతిలేని మాటలే ప్రారంభించారు. ఇట్లా మతిమాలిన స్థితి, ప్రజ్ఞయందు సంస్థితి, రెండూ ఏకకాలంలోనే ఉన్నాయి. సాధకుని దృష్టిలో ఇంకొక ప్రధాన మైన ప్రశ్న ఉన్నది. అక్కడ మతిచాంచల్యమునకు పూర్వమే చైతన్య రూప సంస్థితి సాధించబడిందా లేక ఉన్మత్త స్థితి యందు కూడ, సాధన కొనసాగించబడి, అది ఆత్మానుభవానికి దారి తీసిందా అనేది కేవలము పై సంఘటన ద్వారా మనకు తెలియటం లేదు.

భగవాన్ శ్రీరమణులు, "నిరంతర ఆత్మ విచారణ ద్వారా అన్ని వ్యాధులూ నిర్మూలించబడతాయి", అని అభయము ఇచ్చినది శరీరమే కాదు, మనస్సు అదుపు తప్పినా సాధన సంభవమేనని సూచిస్తున్నది. నిజానికి శరీర వ్యాధి అనేదేమీ ప్రత్యేకంగా లేదు, అంతా మానసికమే.

ఇక, ఉన్మత్తుని ప్రజ్ఞానుభవం కుందేటి కొమ్ము వంటిదని ఎవరన గలరు?

* * *

# లాహిరీ మహాశయ

- కాట్రావులపల్లి సుబ్బలక్ష్మి

లాహిరీ మహాశయ ఒక గొప్ప గృహస్థయోగి. భగవాన్ రమణ మహర్షి ఆత్మవిచార మార్గాన్ని మానవాళికి ప్రసాదించినట్లు, లాహిరీ మహాశయ అన్ని కుల, మత, వర్ణాలకు చెందిన ఆధ్యాత్మిక అన్వేషకులకు క్రియాయోగ దీక్షను ఇచ్చారు. ఎన్నో శివాలయాలను నిర్మించిన ఘనతపొందిన ఒక శివారాధక కుటుంబంలో, పశ్చిమ బెంగాలులో నాడియా జిల్లా, ఘుర్ని గ్రామంలో 1828 సం॥ సెప్టెంబరు 30న లాహిరీ మహాశయ జన్మించారు. వారు గృహస్థ ఆశ్రమంలో ఉంటూ ఆధునిక యుగానికి అనుగుణంగా క్రియాయోగశాస్త్రమును సమాజానికి అందించారు. వారు 1800 సం॥ నుండీ హిమాలయాలలో ఇప్పటికీ దేహంతో సజీవంగా శిష్యులకు దర్శనమిస్తున్న మహా అవతార్ శ్రీ బాబాజీ యొక్క శిష్యులు. గత జన్మలోని ఆధ్యాత్మిక సాధన మరియు గురు అనుగ్రహం వలన లాహిరీ బాబా అతి తక్కువ సమయంలోనే క్రియాయోగ సాధనలో అత్యున్నతమైన స్థితిని సాధించారు.

ఎంతో ఉన్నత స్థితికి చెందిన శ్రీ యుక్తేశ్వరగిరి, స్వామి ప్రణవానంద, అవధూత కేశవానంద మొదలగు యోగులు లాహిరీ మహాశయ వద్ద దీక్షను పొందారు. వారు బోధించిన క్రియా యోగం యొక్క లక్ష్యం ఆత్మ సాక్షాత్కారం. భగవాన్ రమణుల వలె వారు కూడ ఎలాంటి పీఠాన్ని స్థాపించలేదు. కేవలం తమ బోధనల ద్వారా ఆత్మ సాక్షాత్కారానికి సంబంధించిన జ్ఞానాన్ని మానవాళికి ఎంతో సులువుగా అర్థమయ్యేలా అందించడమే ప్రధానంగా తీసుకున్నారు. కాబట్టి సంప్రదాయపరమైన పీఠాల స్థాపనకు వారు ఇష్టపడలేదు.

లాహిరీ మహాశయ శిష్యులలో ఒకరైన 'పంచానన్ భట్టాచార్య' గారి బోధనలను వ్రాయుట మరియు అచ్చు వేయించుటలో ముఖ్య పాత్ర వహించారు. ప్రతి ఒక్కరిలోని నిగూఢమైన శక్తిని బయలుపరిచి అనేక మంది జిజ్ఞాసువులకు వారి రచనలను అందిస్తూ భట్టాచార్య ఎంతగానో సహాయపడ్డారు. భగవాన్ రమణుల వలే లాహిరీ మహాశయ కూడా ప్రతి జీవి యొక్క హృదయంలో 'నేను-నేను' అని స్పందించే చైతన్యమే తమ ఆత్మ అనబడే స్వస్వరూపమని ఉద్బోధించారు.

క్రియాయోగకు సంబంధించిన ప్రధాన అంశాలు ఏమిటి? క్రియా యోగమే భగవద్గీతలో చెప్పిన కర్మయోగం అంటారు. ఇది సనాతనమైన శాస్త్రం. ఇది శరీరంలోని విషపదార్థాలను హరింపజేసి శరీరమంతటా ప్రాణవాయువును నింపడానికి ఉద్దేశింపబడినది. క్రియా యోగంలో సాధకుడు పరిణతులైన గురువుల మార్గదర్శనంలో శరీరంలో ప్రాణశక్తిని రాశిచక్రంలోని పన్నెండు రాశులకు సమాగమమయిన వెన్నెముకలోని ఆరు కేంద్రాలను (ఆజ్ఞ, విశుద్ధ, అనాహత, మణిపూర, స్వాధిష్ఠాన, మూలాధార) చుట్టే విధంగా అభ్యసిస్తాడు. శ్వాస, ప్రతి శ్వాసల ఆధారంగా ప్రాణశక్తిని అదుపు చేసి మనసు అంతర్ముఖమగు నట్లు సాధన చేస్తాడు. దీని ద్వారా స్థిరమయిన మనస్సు ఏర్పడి వాసనల ప్రభావం తగ్గిపోవడంతో ఆత్మ సాక్షాత్కారాన్ని పొందడం సులభమవు తుంది. ఆ దశలో సాధకునికి స్థూల-సూక్ష్మ- కారణ శరీరులకు అతీతమై వాటికి ఆధారమైన శుద్ధ చైతన్యమైన ఎఱుక అనుభవంలోనికి వస్తుంది. ఈ సాధనలో మొదటి నుంచీ కూడా ప్రశాంతమైన అనుభూతులు కలుగుతాయి.

క్రియాయోగ సాధకులు గృహస్థ ధర్మాన్ని విడిచిపెట్టవలసిన అవసరం లేదు. సంసారం కొనసాగిస్తూనే, నీతివంతమైన జీవనాన్ని

గడుపుతూ క్రియాయోగసాధనలో నిమగ్నులు కావచ్చు. దీనితో క్రమంగా తాము ఆధ్యాత్మికంగా ఉన్నతస్థాయికి చేరుకోవచ్చు. నిజానికి గృహస్థా శ్రమం మీదే సన్యాసాశ్రమం మొదలైనవన్నీ ఆధారపడి వున్నాయి. సంసారం కర్మస్థలం. అందరి మధ్య ఉంటూ, దేన్నీ విడువకుండా, సరైన కర్మ ద్వారా జీవితం లోని అందాన్ని ఒక క్రమ పద్ధతిలో అనుభవించవచ్చు. జీవితాన్ని సాధనామార్గంలో మెల్ల మెల్లగా తీర్చిదిద్దు కోవడంతో పాటుగా గృహస్థాశ్రమం ఆత్మోన్నతికి మనసును సిద్ధపరుస్తుంది. దీనితో బాహ్య ప్రపంచంలో తాను ఆనందించే ఆనందాల వెనుక గల సృష్టికర్త మరెంతో ఆనందదాయకుడన్న ప్రగాఢ నమ్మకం ఏర్పడి సాధన తీవ్రతరం చేయడానికి దోహదపడుతుంది. అంతేగాక వ్యక్తి తన పరిస్థితులలో మార్పు తెచ్చే ప్రయత్నంలో శక్తిని వృథా చేయకుండా పరిసరాలకు తగినట్లు తనకు తాను సర్దుబాటు చేసుకొని ఆధ్యాత్మిక సాధనా పురోగతిని పటిష్టం చేసుకోవచ్చు. మనసు ఆత్మలో స్థిరంగా నెలకొనినప్పుడు మనోనాశనం జరిగి ఆలోచనారహిత స్థితికి చేరుకుంటాడు. అదీ ఆత్మప్రాప్తి - సచ్చిదానందం.

భగవాన్ రమణ మహర్షి, లాహిరీ బాబా ఇద్దరూ మానవ జీవితం యొక్క ముఖ్య ఉద్దేశ్యం తమ స్వరూపాన్ని ఎఱుక పరచుకొని, నిరంతరం సాధన ద్వారా జనన మరణ వలయం నుండి విముక్తి చెందగలగడమేనని గ్రహించాలని నొక్కి చెప్పారు.

* * *

# భగవాన్ రమణుల దైవిక లీలలు

- మల్లాది ఫణిమాల

## 1. పులినోటికి చిక్కినది

మళయాళ కుప్పండి స్వామి ఒక ఆధ్యాత్మిక గురువు. వారికి మంజు స్వామి అనెడి చిన్న వయసులో ఉన్న శిష్యుడు కలడు. ఒక రోజు భగవాన్ వద్దకు మళయాళస్వామి, కుంజుస్వామిని తీసుకు వచ్చి "ఈ బాలుని తండ్రి చాలా ఉదారుడు. ఈ బాలుని నా సంరక్షణలో ఉంచి వానిని తీర్చిదిద్దమనెను. నేను అతనికి వేదాంతమును, మౌలిక ఆధ్యాత్మిక సూత్రములను నేర్పితిని. కొన్ని అనివార్య కారణముల వల్ల నేను దూర ప్రయాణము చేయవలసి వచ్చినది. ఈ పిల్లవానికి మంచి గురువును పొందుటకు అర్హత కలదు. ఈతని విద్య పట్ల నేను బాధ్యత తీసుకొనలేని కారణముగా మీకు అప్పగించుచున్నాను. ఈ నిముషము నించి ఈతని బాధ్యత మీదే" అని చెప్పాచూ కుంజు స్వామి చేతులను భగవాన్ చేతులందు పెట్టి నిష్క్రమించెను.

ఆ రోజులలో ఆశ్రమ నిర్వహణ బాధ్యత దండపాణి స్వామి చూచెడి వారు. దండపాణి స్వామి మరియు భగవాన్ నిత్యమూ భోజనమునకు కావలసిన పచ్చళ్ళను, మసాలాలను రుబ్బెడివారు. రోజూ రుబ్బుట వలన భగవాన్ వేలికి నెప్పితో కూడిన వాపు వచ్చినది. అది చూచి కుంజుస్వామి మొదలైన భక్తులు దండపాణిస్వామి వద్దకు వెళ్ళి రోజువారి భోజనమునందు పచ్చళ్ళు మొదలైన రుబ్బెడి పదార్థములను విరమించుమని మనవి చేసిరి. కుంజుస్వామి భగవాన్ వద్దకు వెళ్ళి "దయచేసి రుబ్బెడిపనిని తీసుకొనవలదు. మీరు ఇంకను రుబ్బినచో మీరు రుబ్బిన పదార్థములతో చేసినది ఏదియు నేను తినను" అని చెప్పిరి. కాని అదృష్టవశమున మరుసటి దినమే ఒకరు రుబ్బుటకు అవసరమైన ఆకు కూరలను తీసుకుని వచ్చిరి. ఆ రోజు కుంజుస్వామి

భగవాన్‌చే తయారు చేయబడిన పచ్చడిని తినలేదు. అది తెలుసు కున్న భగవాన్ కుంజుస్వామిని పిలిపించి “నేను ఈ రోజు తినవచ్చునా” అని అడిగిరి. కుంజుస్వామి ఈ ప్రశ్నకు తికమక పడ్డవారై ఏమి బదులు చెప్పవలెనో తెలియకుండిరి. భగవాన్ “నేను మీరందరూ చెప్పినట్లు చేయవలయును. నేను ఒకవేళ అట్లు చేయనిచో వారు భోజనము మాని ధర్నా చేయుదురు. ప్రారంభము నందు అందరూ బుద్ధిగా నుందురు. కాని రోజులు గడిచే కొలది ప్రతివారు షరతులు పెట్టుదురు. వారి ఆజ్ఞలను భగవాన్ అంగీకరించవలయును. భగవాన్‌కు స్వతంత్రత ఏమియు లేదు” అనిరి. కుంజుస్వామి నిర్ఘాంతపోయి మిన్నకుండిరి. ఆయన నీరు నిండిన కనులతో భగవాన్ యొక్క కోపమునకు కారణ మైన తనను సమర్థించుకొనజాలక అట్లే ఉండిరి.

తదుపరి కొన్ని రోజులు భగవాన్ కుంజుస్వామిని “నేను స్నానము చేయవచ్చునా? నాకు కొంచెము ఆహారము దొరుకునా? నేను బాత్ రూముకు వెళ్ళవచ్చునా?” అనుచూ అనేకమార్లు అడుగుచునే యుండిరి. కుంజుస్వామి ఇక ఏ మాత్రము సహించలేక అక్కడినించి పారిపోవు టకు నిర్ణయించుకుని “నేను తిరుపతి వెళ్ళవలయును అని అనుకుంటున్నాను” అని భగవాన్‌కు చెప్పిరి. కాని భగవాన్ బదులు పలుకక ఊరకుండిరి.

ఆ మరుసటి రోజు మధ్యాహ్నము భగవాన్ గిరిప్రదక్షిణ చేయ దలచిరి. కృష్ణస్వామి కుంజుస్వామితో ప్రదక్షిణలో కొంత భాగము భగవాన్‌తో వెళ్ళి పిదప స్టేషన్‌కు వెళ్ళుము అని చెప్పిరి. కుంజుస్వామి తన సంచితో కూడా, ప్రదక్షిణకు బయలుదేరెను. ఆ రోజు భగవాన్ చాలా, చాలా అనగా అతి నెమ్మదిగా నడిచిరి. వారిని దాటి వెళ్ళుట, గురువును అగౌరవపరిచనట్లుగా భావించి, కుంజుస్వామి నిదానముగా నడచి భగవాన్ వెనకనే ఉండక తప్పలేదు. వారు కుబేర లింగము చెంతకు చేరుసరికి తిరుపతి రైలు దూరముగా పోవుటను గమనించి,

భగవాన్, "నీ రైలు పోవుచున్నది పరుగెత్తు. పరిగెత్తి నీ రైలు అందుకొనుము'' అని నవ్వగా అందరును నవ్విరి. కుంజుస్వామి అవమానముతో, విసిగినవాడై ఏమీ చేయునది లేక వారిని అనుసరించి ఆశ్రమమునకు వచ్చెను. ఆ రోజు రాత్రి దండపాణి స్వామి కుంజుస్వామిని భగవాన్ దగ్గరకు తీసుకుని వెళ్ళి "భగవాన్, కుంజుస్వామి మీకు ఆగ్రహము తెప్పించినందులకు క్షమాపణ కోరుచున్నాడు'' అనెను. "నాకు కోపము వచ్చుటకు అతను ఏమి చేసెను? అతను నా వేలు వాచుటను చూచి బాధపడినాడు. నా పట్ల గల అభిమానముచే, నా బాధను చూడలేక అతను భుజింపలేదు. అందువలన కోపము ఎందుకు? నేను కోపముగా నున్నాను అనుకొని తిరుపతికి పారిపోవుటయే పరిష్కారము అని ఎందుకు అనుకోవలయును?'' అని అనిరి.

"అతను కారముగా నున్నవి తినలేడు. ఇక్కడనే అతను సాంబారు, మరియు రసము నందు నీరు కలుపుకుని కష్టముగా తినును. తిరుపతిలో భోజనము ఎంత కారముగా నుండునో మీకు తెలియునా? అక్కడ అతను ఏమి తినును? ఎట్లు గడుపును? అదియును గాక అతని గురువు వచ్చి, అతని గురించి అడిగిన ఎడల నేను ఏమి చెప్పుదును? అతని గురువు అతని చేతిని నా చేతిలో పెట్టి అతనిని నాకు అప్పగించిరి. అతని క్షేమమునకు నేను బాధ్యుడను కానా? అతను ఆశ్రమము వదలి వెళ్ళుటకు ఎట్లు అనుమతింతును?'' అని భగవాన్ చెప్పుటలో ఆయనకు మళయాళ స్వామిపై గల గౌరవమును, వారి భక్తుల క్షేమముపట్ల భగవానులకు గల శ్రద్ధను కుంజుస్వామి గ్రహించిరి. పులినోటి యందు చిక్కిన మాంసపు ముక్క ఎటుల తప్పించు కొనలేదో భక్తుడు గురువు నించి అట్లే తప్పించుకొనలేడు. ఎప్పుడైతే భక్తుడు గురువు అనుగ్రహమనెడి వలలో చిక్కుకొనెనో, అతనికి ఇంక తప్పించుకొనుట అన్నది లేనే లేదు.

# Hanuman, the Embodiment of Devotion and Humility

Dr. K. Subrahmanian (Talk 28)

In the Mahabharata there is an interesting story. When the Pandavas were spending their time in the forest, Draupadi once saw an unusual flower coming from somewhere, carried by the wind. She asked Bheema to get her more such flowers. Bheema went in search of the flower. He found an old monkey, very big in size, on his way. Not wanting to jump over, Bheema asked the monkey to move a little. The monkey said, "I'm old, I'm tired and also sleepy. Why don't you move my tail to another direction and walk across?" When Bheema tried to lift the tail, he was astonished to find that he was unable to move it even a little bit. However much he tried, he could not move the monkey's tail. Surprised at this, he thought that this cannot be an ordinary monkey. So, he asked the monkey, "I am not at all able to lift even your tail. There is only one other person who can be as powerful, as strong as I am, and that is my brother Hanuman. Who are you?" asked Bheema. The monkey said, "Who is this Hanuman you are talking about? Tell me something about him." It was Hanuman himself who asked Bheema to tell something about Hanuman. We may wonder why. The point was, when anybody talks about Hanuman, he will definitely have to talk about Sri Rama; Hanuman was more interested in listening to the story of Sri Rama from Bheema himself. When Bheema narrated the story of Rama, Hanuman was so thrilled, he shed tears of joy. It is said,

**यत्र यत्र रघुनाथ कीर्तनं तत्र तत्र कृतमस्तकान्जलिं ।**
**बाष्पवारि परिपूर्ण लोचनं मारुतिं नमत राक्षसान्तकम् ॥**

*Yatra yatra raghunatha kirtanam Tatra tatra kritamastakanjalim;*

*bashpavari paripurna Lochanam marutim namata rakshakantakam*

"Whenever anybody mentions the name of Rama or sings His praise, there you will find Hanuman sitting with his hands folded. Not only that, his eyes will be full of tears because he is so happy to hear the name of Rama. Let us bow down to this Hanuman." He wasn't interested in listening to his own story. Whenever there was an opportunity to listen to the story of Sri Rama, he created that opportunity and he was so happy, shedding tears. When Bheema saw the monkey shedding tears, he knew that it was his brother. The great thing about Hanuman is this: in the whole of the Ramayana, there is not a single incident which tells you that Hanuman did something for himself.

We spend our whole lives doing something for ourselves or our family and there is not much time to give to other people. Here was a person who did not do anything for himself. His was a life devoted solely to the service of Sri Rama. Just because Hanuman dedicated his entire life in the service of Rama, we should not conclude that Hanuman had a trouble-free life. He had enormous problems; he had to cross the ocean, he had to face many obstacles, Ravana set fire to his tail, there was a fight between him and the rakshasas, they did all kind of things to him. But not even once did he complain that he was treated shabbily. He cheerfully faced all the problems and successfully solved them, without expecting anything in return from Sri Rama. All that he wanted was that he should be devoted to him.

